

కెసిఆర్‌తో అమిత్ జోగి భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి అజిత్ జోగి తనయుడు, జనతా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమిత్ జోగి రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ ముఖ్యనాయకులతో కలిసి బుధవారం ప్రగతి భవన్‌కు వచ్చిన అమిత్ జోగి, సిఎం కెసిఆర్‌తో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, దేశంలోని రాజకీయ పరిణామాలు, జాతీయ వ్యవహారాలపై చర్చించారు. బిఆర్ఎస్ జాతీయ పార్టీ విధి విధానాలను ఆసక్తితో అధినేత కెసిఆర్‌ను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తుల అవసరం ఉందని అమిత్ జోగి అభిప్రాయపడ్డారు.

బిఆర్ఎస్ జాతీయ పార్టీని స్థాపించడాన్ని ఆహ్వానించారు. అనతి కాలంలోనే తెలంగాణ రాష్ట్ర పాలనను దేశానికి ఆదర్శంగా నిలిపారని, సంక్షేమం అభివృద్ధి రంగాల్లో దేశంలో ముందు వరసలో తెలంగాణను నిలిపేందుకు కృషి చేశారని సిఎంను అభినందించారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్‌కు అమిత్ జోగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన తండ్రి ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి అజిత్ జోగీ తన గురించి రాసుకున్న ఆటోబయోగ్రఫీని ఈ సందర్భంగా సిఎం కెసిఆర్‌కు బహూకరించారు. కాగా, జనతా కాంగ్రెస్ పార్టీకి ముగ్గురు ఎమ్మెల్యేలున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం పోటీ పెరిగింది

- మంత్రి జగదీశ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతతో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేందుకు విద్యార్థులు ముందుకు వస్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సూర్యాపేట నియోజకవర్గం చివ్వెంల మండల కేంద్రం లో బుధవారం మన ఊరు మన బడి పథకంలో భాగంగా నూతనంగా ఆధునీకరించిన మండల పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని ఒక తరం చదువు అభ్యసిస్తే ఇక ఆ సమాజానికి తిరుగులేదని నమ్మే ముఖ్యమంత్రి కెసిఆర్ మన ఊరు -మన బడి పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. పాఠశాల ఆవరణ అహ్లాదకరంగా ఉంటేనే చదువులు సరైన పద్ధతిలో కొనసాగుతాయని అన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కోసం రూ. 7,289 కోట్లను ఖర్చు పెడుతుందని తెలిపారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా రూ. 117 కోట్లు కేటాయించారని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో సర్కారు బడి వద్దన్న రోజులు పోయి ప్రస్తుతం సర్కారు చదువులు కావాలనే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వ గురుకులాలలో అడ్మిషన్‌ల కోసం పెరుగుతున్న పోటీయే ఇందుకు నిదర్శనమని అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం వెయ్యి గురుకులాలు ఉన్న ఏకైక రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమేనని అన్నారు.

వెస్ట్‌లైఫ్ ఫుడ్ అమ్మకాల్లో 28% వృద్ధి

ముంబయి : దేశంలో మెక్‌డొనాల్డ్స్‌ను నిర్వహించే వెస్ట్‌లైఫ్ ఫుడ్‌వర్ల్డ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 28.23 శాతం వృద్ధితో రూ.611.46 కోట్ల నికర అమ్మకాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.476.83 కోట్ల అమ్మకాలు చేసింది. ఇదే సమయంలో రూ.20.82 కోట్ల లాభాలు నమోదు చేయగా.. గడిచిన క్యూ3లో 74.69 శాతం వృద్ధితో రూ.36.37 కోట్ల నికర లాభాలు సాధించింది. గడిచిన అక్టోబర్-డిసెంబర్ కాలంలో ఎప్పుడూ లేని విధంగా నెల వారి సగటు అమ్మకాలు రూ.200 కోట్లు దాటిందని తెలిపింది.

తిరోగమనం.. ప్రజావ్యతిరేకం..

- పేదరికాన్ని రూపుమాపేదిగా లేదు
- తెలంగాణకు అన్యాయమంటూ ఆవేదన
- కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన బడ్జెట్ బడ్జెట్ తిరోగమనం ప్రజావ్యతిరేకమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. భారతదేశంలో దారిద్ర్యం లేకుండా చేస్తామని, పేదల్లేని భారత్‌ను ఏర్పాటు చేసేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందని ఘనంగా ప్రకటించారని పేర్కొన్నారు. ఈ పద్దులో దారిద్ర్య నిర్మూలనకు ఉపయోగపడే పథకాలతోపాటు, ఉత్పత్తి రంగానికి దోహదపడే కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సిన వాటాను గణనీయంగా తగ్గించారని విమర్శించారు. గతేడాది వరకూ రాష్ట్రాల నుంచి వచ్చే పన్నుల్లో కేంద్రం 42 శాతం తిరిగి రాష్ట్రాలకు ఇవ్వగా, గతేడాది నుంచి ఆ శాతాన్ని 41కి తగ్గించిందని వివరించారు. దీంతో రాష్ట్రానికి 2.133 శాతం వాటా మాత్రమే తిరిగి వస్తోందని తెలిపారు. అవికూడా సకాలంలో ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం కేటాయించిన ప్రకృతి వైపరీత్యాల పరిహారం, స్థానిక సంస్థలకు నిధులు, మున్సిపాల్టీలకు ఇచ్చే నిధులు, ఉన్నత విద్య, ఆరోగ్యం వంటి రంగాలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో రాష్ట్రానికి కోత పెట్టారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాగునీటి వనరులకు నిధులివ్వాలంటూ కోరినా కేంద్రం నిరాకరిస్తున్నదని విమర్శించారు. పైగా రాష్ట్ర నదులపై కేంద్రం బోర్డులు వేసి తన ఆధీనంలోకి తీసుకున్నదని తెలిపారు. దీంతో ప్రస్తుతం నిర్మాణాలు ఆగిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి మంజూరు చేసిన రైల్వేలైన్లకు నిధుల కేటాయింపు తగ్గిందని వివరించారు. దశాబ్దాల తరబడి మంజూరైన కొన్ని పనులు పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంపై కేంద్రం కక్షపూరిత వైఖరితో వ్యవహరిస్తున్నట్టు ఈ బడ్జెట్‌లో స్పష్టమైందని పేర్కొన్నారు. రూ.10,79,971 కోట్లు (24 శాతం) వడ్డీలకిందనే చెల్లిస్తున్నారని తెలిపారు. స్వదేశీ, విదేశీ అప్పులు కలిసి రూ.137 లక్షల కోట్లకు చేరుకున్నట్టు ఎకనామిక్ సర్వే తెలుపుతున్నదని వివరించారు.

దేశాభివృద్ధి ఎలా సాధ్యం

2025 నాటికి ఐదు ట్రిలియన్ డాలర్ల దేశ స్థూల ఉత్పత్తిని సాధిస్తామంటూ ప్రధాని మోడీ అనేకసార్లు ప్రకటించారని తమ్మినేని గుర్తు చేశారు. రానున్న రెండేళ్లలో రెట్టింపు స్థూల ఉత్పత్తి పెరుగుతుందా? అని ప్రశ్నించారు. ఈ ఏడాది దేశ వృద్ధిరేటు ఏడు శాతం ఉన్నట్టుగా చెప్తూనే 2023-24లో 6.5 శాతానికి తగ్గుతుందంటూ ఆర్థికమంత్రి ప్రకటించారని వివరించారు. ఈ స్థితిలో దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఉపాధిహామీ పథకానికి 2022-23లో రూ.89,400 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లకే పరిమితం చేశారని తెలిపారు. ఆహార సబ్సిడీని గతేడాది నిధులపై 50 శాతం తగ్గించారని పేర్కొన్నారు. గ్యాస్‌పై సబ్సిడీని సైతం తగ్గించారని వివరించారు. ఆకలి సూచీలో భారతదేశం 191 దేశాల్లో 140వ స్థానాన్ని ఆక్రమించిందని తెలిపారు. విద్యలో 33వ స్థానం, ఆరోగ్యంలో 66వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దేశాభివృద్ధి కావడానికి ప్రస్తుత బడ్జెట్ సహకరిస్తుందా?అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు దారిద్ర్యంలోకి వెళ్తున్నప్పటికీ కార్పొరేట్లకు మాత్రం ఎన్పీఏల పేరుతో రూ.12 లక్షల కోట్ల రుణాలను రద్దు చేశారని విమర్శించారు. కరోనా సందర్భంగా గ్రామాలకు తిరిగి వచ్చిన వలస కార్మికులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బడ్జెట్ పేదరికాన్ని రూపుమాపేదిగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసే విధంగా ఉందని విమర్శించారు.

హామీలను విస్మరించిన బిజెపి

- ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్రంలోని బిజెపి సర్కారు మరోసారి విస్మరించిందని ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బడ్జెట్ వల్ల రాష్ట్ర ప్రజలకు ఉపయోగం లేకుండా పోయిందని విమర్శించారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం ఊసేలేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విభజన చట్టాన్ని ఆమోదించి పదేండ్లు అవుతున్నా ఇప్పటిదాకా బిజెపి ప్రభుత్వం ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. బడ్జెట్‌లోనూ బిజెపి రాజకీయం చేసిందని పేర్కొన్నారు. ఎన్నికలున్న రాష్ట్రాలకు వెసులుబాటు ఇచ్చిందనీ, ఇతర రాష్ట్రాలకు అన్యాయం చేసిందని, పన్ను మినహాయింపు సగటు జీవికి నిరాశపరిచిందని పేర్కొన్నారు. పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పెత్తందారులకి అనుకూల బడ్జెట్‌గా ఉందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు లాభం చేసే పనిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉన్నారని విమర్శించారు.

వ్యవసాయానికి కోతలా?

- రైతుల ఆదాయం రెట్టింపు ఎలా సాధ్యం...?
- కేంద్రానికి తెలంగాణ రైతు సంఘం ప్రశ్న

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయానికి బడ్జెట్‌లో కోతలు విధించి, రైతుల ఆదాయాన్ని ఎలా రెట్టింపు చేస్తారని తెలంగాణ రైతు సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈమేరకు బుధవారం ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24లో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి రూ.1,15,531.79 కోట్లు కేటాయించిందనీ, అందులో వ్యవసాయానికి రూ.71,378 కోట్లు మాత్రమే కేటాయించి,మిగిలిన నిధులు పథకాలకు వెచ్చించిందని పేర్కొన్నారు. అన్ని అనుమతులు పొందిన సాగునీటి వనరులకు కేంద్రం నుంచి అన్ని రాష్ట్రాలకు రూ.4వేలు కోట్లు ఇస్తుండగా, గతేడాది నుంచి దానిని తగ్గించిందని గుర్తు చేశారు. పరిశోధనలకు గతంలో రూ.8,513 కోట్లు ఇవ్వగా దానిని రూ.9వేల కోట్లకు పెంచినప్పటికీ పరిశోధనలకు మాత్రం రూ.8,941 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. పశు సంవర్ధక శాఖకు గతంలో రూ.4వేల కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.4,687 కోట్లమేర నామమాత్రంగా పెంచిందని తెలిపారు. వ్యవసాయ రంగానికి మొత్తం బడ్జెట్‌లో 3.2 శాతం మాత్రమే నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ప్రకతి వైపరీత్యాల వల్ల పెద్ద ఎత్తున నష్టం జరుగుతున్నప్పటికీ కేంద్రం బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదని విమర్శించారు. రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేయకపోవడం వల్ల బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడంలేదని పేర్కొన్నారు. మార్కెట్లలో కనీస మద్దతు ధరలు అమలు కావడం లేదని తెలిపారు. ఈ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ బడ్జెట్‌ను పున:పరిశీలించాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

12న పాలకుర్తి నుంచి పాదయాత్ర

- 28న ఇందిరాపార్కు వద్ద ముగింపు
- జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు
- సిఐటియు ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ వెల్లడి



పాదయాత్ర పోస్టర్‌ను అవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల సాధన కోసం పోరాటాల పురిటి గడ్డ, వీరనారి చిట్యాల ఐలమ్మ స్వగ్రామమైన పాలకుర్తి నుంచి ఈ నెల 12న పాదయాత్ర ప్రారంభిస్తామని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్ తెలిపారు. 15 రోజులపాటు కొనసాగనున్న పాదయాత్ర (300కిలోమీటర్లు) జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లా మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటుందని చెప్పారు. ముగింపు సందర్భంగా ఇందిరాపార్కు వద్ద ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. ఇదే క్రమంలో ఆయా జిల్లా కేంద్రాల్లో ఉపపాదయాత్ర చేయాలనీ, కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాలని పిలుపునిచ్చారు. పాలడుగు భాస్కర్ నేతృత్వంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్యార పాండు, చాగంటి వెంకటయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు పి గణపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు తునికి మహేష్, పి వినోద్ పాదయాత్ర బృందంలో ఉంటారని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో అందుకు సంబంధించిన పోస్టర్, కరపత్రాన్ని రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ నాలుగులేబర్ కోడ్లు, కనీస వేతనం రూ. 26వేలు, ఉద్యోగాలు పర్మినెంట్, వేతనాలు పెంపుదల, కారోబార్లకు స్పెషల్ స్టేటస్, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందిలో అత్యధికులు దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు చెందిన వారేనన్నారు. అందుకే రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సొంత నియోజకవర్గం పాలకుర్తి కేంద్రంగా పాదయాత్రను ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. పాలకులు మారినా వారి బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురి అవుతున్నారని చెప్పారు. గ్రామ పంచాయతీ కార్మికులు సుదీర్ఘకాలం పోరాటం చేస్తే, టిఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి ప్రాతిపదిక లేకుండా అశాస్త్రీయంగా జిఒ నెంబర్ 51 తెచ్చిందన్నారు. 500 జనాభాకు ఒక్క కార్మికుడు చొప్పున లెక్కించి వేతనాన్ని రూ 8,500 నిర్ణయించి చేతులుదులుపుకుందని తెలిపారు. అదనంగా ఉన్న కార్మికులకు ఎలాంటి వేతనాలు చెల్లించడం లేదని, ఒక కార్మికుడికి ఇచ్చే వేతనాన్ని అక్కడ పని చేసే కార్మికులందరూ పంచుకుంటున్నారని, ఫలితంగా రూ 3, 500 నుంచి రూ 4,500 వరకే వేతనాలు పొందుతున్నారని చెప్పారు.

డిమాండ్లు

- కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి
- మోడీ నిర్ణయించిన వేతనం రోజుకు రూ 178 మాకొద్దు.కనీస వేతనం నెలకు రూ 26వేలుగా నిర్ణయించాలి.
- జిఒ నెం 60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ 16,500 ,కారోబార్,బిల్ కలెక్టర్లకు రూ 19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ 22, 750 వేతనాన్ని చెల్లించాలి.
- చట్టం ప్రకారం పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలి.
- కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలి. వారిని అసిస్టెంట్ కార్యదర్శులుగా నియమించి ప్రభుత్వ గ్రాంట్ ద్వారా వేతనాలు చెల్లించాలి.
- ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా సౌకర్యాలు అమలు చేయాలి.
- పంచాయతీ కార్మికులందరికీ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ 5, 50,000 ఆర్థిక సాయం చేయాలి.
- దళిత బంధు పథకాన్ని పంచాయతీ సిబ్బందికి ప్రాధాన్యత ఇచ్చి అమలు చేయాలి.



మజాకు నాగార్జున ప్రచారం

హైదరాబాద్ : ప్రముఖ శీతలపానియం మజాకు హీరో అక్కినేని నాగర్జున బ్రాండ్ అంబాసీడర్‌గా నియమితులయ్యారు. భారత్, ఆగ్నేయాసియాలో అత్యంత వేగంగా వద్ధి చెందుతున్న మజా ఇప్పుడు తమ నూతన 'ఆమ్‌వాలీ దిల్‌దారీ, బినా నామ్ వాలీ దిల్‌దారీ' ప్రచారం ప్రారంభించినట్లు ఆ సంస్థ తెలిపింది. తాజా ప్రచారంలో నటుడు అమితాబ్ బచ్చన్, నటి పూజా హెగ్డేతో పాటుగా దక్షిణాది సూపర్‌స్టార్ నాగార్జున కూడా కనిపించనున్నారని పేర్కొంది.

బడ్జెట్‌పై కార్పొరేట్ల స్పందన



హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌పై పారిశ్రామిక సంఘాలు, కార్పొరేట్ వర్గాలు సానుకూలంగా స్పందించాయి. ఫిక్కీ, సిఐఐ, ఎఫ్‌టిసిసిఐ బడ్జెట్‌ను స్వాగతించాయి. ఇది వృద్ధి ఆధారిత బడ్జెట్ అని పేర్కొన్నాయి.

ఎంఎస్ఎంఇలకు మద్దతు : సిఐఐ

"సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ)లకు మద్దతునిచ్చేలా బడ్జెట్ ఉంది. ఎంఎస్ఎంఇలకు రూ.2 కోట్ల వరకు క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ పథకాన్ని కొనసాగించడం సహా ఇతర ప్రోత్సహకాలు హర్షణీయం. చిన్న పరిశ్రమలకు మద్దతును ఇవ్వడం ద్వారా తిరిగి వాటి వృద్ధి పుంజుకోనుంది. విత్త లోటును 6 శాతం దిగువనకు చేర్చాలనే లక్ష్యం స్వాగతించదగినది.' అని సిఐఐ ప్రెసిడెంట్ సంజీవ్ భన్సల్ పేర్కొన్నారు.

బ్యాలెన్స్‌డ్‌గా ఉంది : ఫిక్కీ

"కేంద్ర బడ్జెట్ బ్యాలెన్స్‌గా, అభివృద్ధికి దోహదంగా ఉంది. ప్రధానంగా వృద్ధికి ప్రాధాన్యతను ఇచ్చింది. ఖచ్చితంగా ఇదే మేము కోరుకున్నది. వ్యవసాయ రంగంపై ప్రధాన దృష్టి పెట్టారు. అదే విధంగా పట్టణీకరణ, డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యతను ఇచ్చారు." అని ఫిక్కీ ప్రెసిడెంట్ సుబ్రకాంత్ పాండ తెలిపారు.

వృద్ధికి దోహదం : ఎఫ్‌టిసిసిఐ

"మంత్రి సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సమ్మిళిత వృద్ధికి దోహదం చేసేలా ఉంది. అన్ని రంగాలకు ప్రాధాన్యతను ఇచ్చారు. మౌళిక వసతుల అభివృద్ధి, పెట్టుబడులు, విమానాశ్రయాలు, యవతకు అవకాశాలు, గిరిజనాభివృద్ధి, గృహాలు, మోడల్ స్కూళ్లు తదితర అన్ని రంగాలను పరిగణలోకి తీసుకున్నారు. పన్ను పరిమితిని రూ.7లక్షలకు పెంచడం మంచి పరిణామం." అని ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ అనీల్ అగర్వాల్ అన్నారు.

ఆరోగ్య సంరక్షణపై దృష్టి : అపోలో హాస్పిటల్స్

"కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య సంరక్షణపై ఎక్కువ శ్రద్ధ చూపారు. హెల్త్‌కేర్ స్కిల్ డెవలప్‌మెంట్, 157 నూతన నర్సింగ్ కళాశాలలు, వైద్య పరికరాల తయారీ, ఆవిష్కరణల కోసం నూతన నైపుణ్య అభివృద్ధి కోర్సులను ప్రకటించడం హర్షణీయం. ఆరోగ్య సంరక్షణ విభాగంలో పరిశోధన, ఆవిష్కరణలకు అవకాశాలను సృష్టిస్తుంది. హెల్త్‌కేర్ అప్లికేషన్‌లను అభివద్ధి చేయడానికి 5జి ల్యాబ్‌లను ప్రోత్సహించడం ద్వారా సుదూర భౌగోళిక ప్రాంతాలలో నివసించే ప్రజలకు ఆరోగ్య సంరక్షణ కనెక్టివిటీ, సంరక్షణ మెరుగుపడుతాయి." అని అపోలో గ్రూపు హాస్పిటల్స్ ప్రెసిడెంట్ డాక్టర్ కె హరి ప్రసాద్ పేర్కొన్నారు.

నవీన్‌మిట్టల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



నవీన్‌మిట్టల్‌ను అభినందిస్తున్న విఆర్ఒ, విఆర్ఎ సంఘాల ప్రతినిధులు

రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అధికారి నవీన్ మిట్టల్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం మధ్యాహ్నం సచివాలయంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది మధ్య ఛార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా సచివాలయ సంఘం, విఆర్ఒ, విఆర్ఎ సంఘాల ప్రతినిధులు నవీన్‌మిట్టల్‌ను కలిసి అభినందనలు తెలిపారు. దీర్ఘకాలికంగా సిసిఎల్ఎకు పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ఆ శాఖలో కొంత స్థబ్దత నెలకొంది. ఇప్పటిదాకా సాంకేతిక విద్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యదర్శిగా ఇంటర్ బోర్డుకు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన సంగతి తెలిసిందే. నవీన్‌మిట్టల్ ఏ శాఖలో పనిచేసినా, ఆ శాఖలో సంస్కరణలు ప్రవేశపెట్టి పనితీరు మెరుగుపరుస్తారనే పేరుందని ఆయా సంఘాల ప్రతినిధులు అభిప్రాయడుతున్నారు. గత నాలుగేళ్లుగా ఇటు రెవెన్యూ శాఖ, అటు సిసిఎల్ఎలోనూ ఉన్నతస్థాయిలో అధికారులు లేకపోవడంతో సమస్యలు పేరుకుపోయాయనే వ్యాఖ్యానాలు రెవెన్యూ శాఖలో వినిపిస్తున్నాయి. అలాగే ధరణి ఇప్పటికీ బాలారిష్టాలను ఎదుర్కొంటున్న విషయమూ విదితమే. అలాగే రిజిస్ట్రేషన్ల శాఖలోనూ సమస్యలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో నవీన్‌మిట్టల్ రావడం మంచి పరిణామమని ఆ శాఖ ఉద్యోగులు చెబుతుండటం గమనార్హం.



సింగరేణికార్మికులు పనిచేస్తున్న దృశ్యం

బొగ్గు రవాణాలో సింగరేణి సంస్థ ఆల్ టైం రికార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బొగ్గు రవాణాలో సింగరేణి సంస్థ ఆల్ టైం రికార్డు సృష్టించింది. జనవరి నెలలో రూ. 68.4 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసి సింగరేణి చరిత్రలోనే అరుదైన రికార్డును నమోదు చేసిందని బుధవారం యాజమాన్యం ప్రకటించింది. 2016 మార్చిలో చేసిన రూ. 64.70 లక్షల టన్నుల బొగ్గు రవాణాను అధిగమించి రికార్డు నెలకొల్పింది. జనవరి నెలలో మొత్తం 11 ఏరియాల నుంచి సగటున రోజుకు 39 రైళ్లలో మొత్తం 1,216 రేకులతో బొగ్గు రవాణా చేశారు. తెలంగాణ జెన్‌కో సహా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎక్కువ శాతం బొగ్గు రవాణా చేసినట్లు సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. బొగ్గు రవాణా తోపాటు ఓపెన్ కాస్టు గనుల్లో ఓవర్ బర్డెన్ తొలగింపులోనూ సింగరేణి కొత్త రికార్డును నెలకొల్పింది. కంపెనీ చరిత్రలో తొలిసారిగా జనవరి 31వ తేదీన ఉదయం షిఫ్టు నుంచి రాత్రి షిఫ్టు వరకు అత్యధికంగా 16.67 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించి సింగరేణి సంస్థ రికార్డు సృష్టించింది. గత నెల జనవరి 30వ తేదీన సాధించిన 15.75 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ ఇప్పటివరకు గరిష్ఠ రికార్డుగా ఉంది.

విద్యా వైద్యాన్ని వదిలేసిన పద్దు

- కేంద్ర బడ్జెట్‌పై ఎమ్మెల్సీ అలుగుబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో విద్యా, వైద్య రంగాల్లోని ప్రధాన అంశాలను వదిలేసి, కొన్ని ప్రత్యేక అంశాలకు మాత్రమే బడ్జెట్ కేటాయింపులు చేయడం సరైంది కాదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రెండు రంగాలను ప్రయివేటుకు వదిలేసేలా బడ్జెట్ ఉన్నదని తెలిపారు. దేశంలోని 15 లక్షల పాఠశాలలను ఎలా అభివృద్ధి చేస్తామనే ప్రస్తావన లేకుండా అందరికీ నాణ్యమైన విద్యనందించటం సాధ్యం కాదని తెలిపారు. గిరిజనుల్లో అత్యధిక మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుంటారనీ, అలాంటి పాఠశాలలను అభివృద్ధి చేయకుండా 750 ఏకలవ్య స్కూళ్లు ప్రారంభిస్తాం, అందులో 3.50 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటారంటూ గొప్పలు చెప్పుకోవడం కేంద్ర ప్రభుత్వానికే చెల్లిందని ఎద్దేవా చేశారు.

బడ్జెట్లో ఉన్నత విద్యారంగం, ప్రభుత్వ యూనివర్సిటీల ప్రస్తావన, ప్రతిపాదనలేవీ లేవు, పరిశోధనా రంగం గురించి కూడా ప్రస్తావించలేదు. యువతకు పని నైపుణ్యం కల్పిస్తాం, ఏ దేశమైనా పోయి బతకండి అనే విధంగా బడ్జెట్ ప్రసంగం చేశారని అలుగుబెల్లి ఈ సందర్భంగా విమర్శించారు. వైద్య రంగంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ఎలాంటి సూచనలు లేవని తప్పుపట్టారు. వాటిని అభివృద్ధి చేయకుండా ప్రభుత్వ వైద్యరంగాన్ని బాగు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. రోడ్లు, రవాణా రంగాలను ప్రయివేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని చెప్పడమంటే ప్రజలపై అదనపు భారాలు మోపడమేనని అభిప్రాయపడ్డారు. ప్రయివేటు రంగంలో పని చేస్తున్న కార్మిక వర్గం సంక్షేమం గురించి పట్టించుకోని బడ్జెట్ ప్రజా బడ్జెట్ కాదని తెలిపారు. పై పై పూతలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లేయించుకోవడానికి ఎంచుకున్న మార్గంగా ఈ బడ్జెట్ కనిపిస్తున్నదని పేర్కొన్నారు.

పిఎం కేర్స్ ప్రభుత్వ సంస్థ కాదనడం సమంజసం కాదు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిఎం కేర్స్ ఫండ్‌నిపబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా పేర్కొంటూ ఢిల్లీ హైకోర్టుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారాన్ని తెలంగాణ మంత్రి కేటీఆర్ తప్పుబట్టారు. భారత రాజ్యాంగం, పార్లమెంట్, ఏదైనా రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం ద్వారా పిఎం కేర్స్ ఫండ్ సృష్టించలేదని కేంద్రం ఢిల్లీ కోర్టుకు తెలిపింది. కేంద్ర ప్రభుత్వ వివరణపై ట్విటర్ వేదికగా స్పందిస్తూ కెటిఆర్ అసహనం వ్యక్తం చేశారు. "ప్రభుత్వ చిహ్నం, ప్రభుత్వ వెబ్‌సైట్‌ని వినియోగిస్తూనే పిఎం కేర్స్ ప్రభుత్వ సంస్థ కాదని చెబుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. ఎన్‌డియే ప్రభుత్వం ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తుందనడానికి ఇదో క్లాసిక్ ఉదాహరణ" అని కెటిఆర్ పేర్కొన్నారు.

దేశంలో కరోనా వైరస్ విలయతాండవం చేస్తున్న వేళ.. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పిఎం కేర్స్ పేరుతో అత్యవసర సహాయ నిధిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పిఎం కేర్స్ నిధిని ప్రభుత్వ నిధిగా ప్రకటించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో సంయక్ గంగ్వాల్ అనే ఓ న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఒక వేళ అది ప్రభుత్వ నిధి కాకుంటే వెబ్‌సైట్ డొమైన్ పేరులో ప్రధానమంత్రి ఫొటో, కేంద్ర ప్రభుత్వ ముద్రను తొలగించాలని కోర్టుకు తెలిపారు. ఆ పిటిషన్ విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ ద్వారా వివరణ ఇచ్చింది. "ఇది ప్రభుత్వ నిధి కాదు. పిఎం కేర్స్ కింద సేకరించిన విరాళాలు భారత ఏకీకృత నిధికి వెళ్లవు. ఇతర ట్రస్టుల మాదిరిగానే ఈ ట్రస్టుకు వచ్చిన నిధుల వినియోగం పూర్తి పారదర్శకంగానే ఉంటుంది" ఢిల్లీ హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్రం పేర్కొంది.

పేదలకు గుంట భూమైనా ఇవ్వరా..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను తిప్పి కొట్టాలి
- పట్టాలు అందే వరకు పోరాటం ఆగదు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వాలు నియంత పాలన కొనసాగిస్తున్నాయని బడా నేతలకు అప్పనంగా ఎకరాల కొద్దీ భూములు కట్టబెడుతూ.. పేదలకు మాత్రం గుంట భూమి ఇవ్వడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ అన్నారు. ఇళ్ల స్థలాల పట్టాలు అందే వరకు పోరాటం ఆగదని, పేద ప్రజలకు ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువు సర్వే నంబర్ 280, 283, 284, 285లోని సుమారు 24 ఎకరాల శిఖం భూమిలో ఆరు రోజుల కిందట సిపిఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేశారు. సుమారు 1500 గుడిసెలు వేశారు. బుధవారం అబ్బాస్ గుడిసెవాసులను కలిసి మద్దతు తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూమి అంటే ప్రజల భూమి అని.. దానిపై పూర్తి హక్కు పేదలకే ఉంటుందన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 32వేల ఎకరాల్లో ఎర్రజెండాలు రెపరెపలాడుతున్నాయని వివరించారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల కోసం మూడున్నర లక్షల మంది నిరుపేదలు గుడిసెలు వేసుకున్నట్టు తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తానన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పటికీ ఇవ్వకపోవడంతో పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటున్నారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే గుడ్లప్పగించి చూస్తున్న ప్రభుత్వం.. పేదలపై కేసులు పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. భూపోరాటంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి శిఖం భూములను పేదలకు పంచి పట్టాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. భూమిని వదిలేది లేదని కరెంటు నీరు, రావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఫిబ్రవరి తొమ్మిదిన హైదరాబాదులో జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో 45 కోట్ల మంది దగ్గర ఉన్న సొత్తు ఎంతో.. కేవలం ఒక అదాని దగ్గర అంత ఉందని చెప్పారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో 15 ఎకరాల్లో ఓ ధనవంతుడు ఇల్లు నిర్మించుకుంటే తప్పులేదు కానీ.. పేదలు గుడిసెలు వేసుకుంటే దౌర్జన్యం ఎందుకని ప్రశ్నించారు. పేదలకు ఉపయోగపడే నిత్యావసర సరుకులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల భారత్ పేరుతో పేదలు గ్యాస్ పంపిణీ చేసినా.. ధర పెరగడం వల్ల మళ్లీ కట్టెల పొయ్యే దిక్కు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాంపెటి రాజన్న, చెన్నూరి రమేష్, పొలం రాజేందర్, దమేర కిరణ్, నాయకులు డబ్బా రాజన్న, అతుకురి శ్రీకాంత్, పొలం చిన్న రాజేందర్, సకినాల మల్లయ్య, గుర్రం దేవందర్, బొడ్డు కిషోర్, బొడ్డు స్మరన్, రాజు పాల్గొన్నారు.

తెలంగాణ ఊసే లేదు

- కేంద్ర బడ్జెట్‌పై వైఎస్ షర్మిల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ సమస్యల ఊసెత్తకపోవడం దుర్మార్గమని వైఎస్‌ఆర్‌టిపి వైఎస్ షర్మిల విమర్శించారు. ఈసారి కూడా విభజన చట్టంలోని హామీలను పట్టించుకోలేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కుపరిశ్రమ, పసుపుబోర్డు, ములుగు గిరిజన యూనివర్సిటీ ప్రస్తావించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 'అడగనిదే అమ్మైనా అన్నం పెట్టదు' అన్నట్టు మన సిఎం ఏనాడైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం కొట్లాడారా? ప్రధాని రాష్ట్రానికొస్తే ఎదురెళ్లి విభజన సమస్యలు అడిగారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు నష్టం చేస్తున్నాయని విమర్శించారు.

బడ్జెట్‌లో అప్పులు తప్ప ఏమీ లేవు

- రెడ్కో చైర్మన్ వై సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అప్పుల కుప్పగా ఉన్నదే తప్ప, అభివృద్ధి ఊసే లేదని టిఎస్‌రెడ్కో చైర్మన్ వై సతీష్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌లో 34 శాతం అప్పులే ఉన్నాయనీ, 20 శాతం సొమ్ము వడ్డీల కిందే పోతున్నదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ సాక్షిగా ఒప్పుకున్నారన్నారని చెప్పారు. దేశానికి ఇంతకంటే దౌర్భాగ్య పరిస్థితి ఇంకేం ఉంటుందన్నారు. 2014 వరకు భారతదేశ అప్పులు రూ. 55 లక్షల కోట్లు ఉంటే, ప్రస్తుతం అది రూ.169 లక్షల కోట్లకు చేరిందన్నారు.

ప్రభుత్వ 'కెజి టు పిజి' దేశంలో ఎక్కడా లేదు

- రాష్ట్రంలో తొలి అడుగు గంభీరావుపేట విద్యాసంస్థలు
- మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, కెటిఆర్
- రాష్ట్ర వ్యాప్తంగా 'మన ఊరు-మనబడి' ప్రారంభం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కెజి టు పిజి' లాంటి విద్యా సంస్థలు లేవని, గంభీరావుపేట ఈ విద్యాసంస్థలు తెలంగాణకు తొలి అడుగుగా ఉంటాయని విద్యా శాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం 'మన ఊరు- మన బడి' మొదటి దశ పాఠశాలలను మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో కెజి టు పిజి క్యాంపస్‌ను మంత్రు సబిత, కెటిఆర్ ప్రారంభించారు. ఈ క్యాంపస్‌కు ఆచార్య జయశంకర్ పేరుగా నామకరణం చేయాలన్నారు. అనంతరం క్యాంపస్‌లోని కిండర్ గార్డెన్ నుంచి పిజి కళాశాల బ్లాక్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, డిజిటల్ లైబ్రరీతోపాటు వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి కెటిఆర్ మాట్లాడారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత కెజి టు పిజి విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తామని సిఎం కెసిఆర్ చెప్పారన్నారు. ఆయన హామీ ప్రతి రూపమే ఈ క్యాంపస్ అన్నారు. క్యాంపస్ నిర్మాణానికి తోడ్పాటు అందించిన రహేజా, దివిస్ ల్యాబరేటరీ, గివ్ తెలంగాణ, ఎంఆర్‌ఎఫ్ ప్రతినిధులను సన్మానించారు. క్యాంపస్‌లో విద్యార్థులతో కలిసి మంత్రులు భోజనం చేశారు.

చింతకుంట మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన పాఠశాలలను బిసి సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. విద్యకు దూరం కావద్దని సిఎం కెసిఆర్ వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారన్నారు. జిల్లాలో మొదటి విడత మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా 230 పాఠశాలలను రూ.92 కోట్లలతో ఆధునీకరణ చేయనున్నట్టు తెలిపారు. నిర్మల్‌లో పాఠశాలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు.

మన బస్తీ-మన బడి కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో పలు చోట్ల అభివృద్ధి చేసిన పాఠశాలలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. పద్మారావునగర్‌లోని మైలార్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని లక్ష్మినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని రాజ్‌భవన్ ప్రాథమిక పాఠశాలలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు సాయన్న, దానం నాగేందర్, హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణీతో మంత్రి కలిసి ప్రారంభించారు.

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నామన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కమలానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు.

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల, నార్కట్‌పల్లి ప్రాథమిక పాఠశాలను పరిషత్ చైర్మెన్ బండా నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల భవనాన్ని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌తో కలిసి ప్రారంభించారు.

ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం ప్రాథమిక పాఠశాలను రూ.12.49 లక్షలు, శాంతినగర్ ఉన్నత పాఠశాలను రూ.1.14 కోట్లతో మన ఊరు-మన బడి/మన బస్తీ-మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేయగా.. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు.

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మాటేడు ప్రభుత్వ పాఠశాలను మంత్రి ఎర్రబెల్లి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజలూ భాగస్వాములు కావాలని కోరారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు, ప్రజా సంఘాల నాయకులు

పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాలకు పట్టాలివ్వాలి

- ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని
- కొత్తగూడెం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలు గుడిసెలు వేసుకున్న ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని వెంకటేశ్వర కాలనీ పంచాయతీ పరిధిలోని 137/1 ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాల కోసం పేదలు గుడిసెలు వేశారు. గుడిసెలు వేసుకున్న స్థలం వెంకటేశ్వర కాలనీ నుంచి చుంచుపల్లి తహశీల్దార్ కార్యాలయం వరకు బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రేపాకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో పోతినేని మాట్లాడారు. ఇంటి స్థలం, ఇళ్లు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పే అభివృద్ధి కాగితాల్లో మాత్రమే ఉందని విమర్శించారు. ప్రజలకు ఇళ్లు, విద్య, భూమి, వైద్యం అందినప్పుడే నిజమైన అభివృద్ధి అన్నారు.

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కెసిఆర్ వెంటనే స్పందించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెల ప్రాంతంలో మంచినీరు, విద్యుత్ ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజు, సిఐటియు జిల్లా నాయకులు భూక్య రమేష్, వీరన్న, ఐద్వా నాయకులు సందకూరి లక్ష్మి, ఈసం రాంబాబు, బాల కృష్ణ, ప్రేమ్ కుమార్, జబ్బ సంధ్యారాణి, రాము, సిద్దెల రాములు, పూజారి నాగమణి, వీరమ్మ, రామకోటమ్మ, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

'పశు మిత్రుల'ను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఫిబ్రవరి 15న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న పశుమిత్రులను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం రాష్ట్ర పశుమిత్రుల వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో ఎడ్ల రమేష్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2500 మంది పశుమిత్రులు ఎనిమిదేండ్లుగా సేవలందిస్తున్నారని తెలిపారు. వీరిలో ఎక్కువగా మహిళలే ఉన్నారని చెప్పారు. వీరికి ఐకెపి ద్వారా ప్రభుత్వం శిక్షణ ఇచ్చి ఎలాంటి పారితోషికమూ నిర్ణయించకుండా పశువైద్య శాఖలో పశుమిత్రులుగా నియమించిందన్నారు. వారు గ్రామీణ ప్రాంతాల్లో పశువులు, మూగజీవాలకు కృత్రిమ గర్భధారణతోపాటు



సదస్సులో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

వ్యాక్సినేషన్, నట్టల మందు వేయడం, వ్యాధుల నివారణకు సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో పశు మిత్రులకు ఫిక్స్‌డ్ వేతనం, యూనిఫామ్, గుర్తింపు కార్డు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఫిబ్రవరి 15న చలో ప్రగతి భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.

కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో జీవో నెంబర్ 60 ప్రకారం వేతన సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం, ఆశా కార్యకర్తల మాదిరిగా పశుమిత్రులకు పారితోషికం నిర్ణయం తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పశు మిత్రులంతా బిఆర్‌ఎస్ నాయకులను నిలదీయడానికి సిద్ధం కావాలన్నారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు.

నూతన కమిటీ ఎన్నిక

రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా జె.వెంకటేష్, అధ్యక్షులుగా కె.శారద, ప్రధాన కార్యదర్శిగా కాసు మాధవి, కోశాధికారిగా శ్రీరామ్ పద్మ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కవిత, మనిషా, శ్రీలత, త్రివేణి, ప్రియాంక, సహాయ కార్యదర్శిగా ఎడ్ల రమేష్, లక్ష్మీనరసింహ, కమిటీ సభ్యులుగా లలితా, ప్రభా, మౌనిక తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, రంజిత్ కుమార్, కవిత, కడారి నరసింహ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో 200 పైగా డాల్బీ అట్మాస్ స్క్రీన్లు



హైదరాబాద్ : భారత్‌లో డాల్బీ అట్మాస్ 10 ఏళ్లను పూర్తి చేసుకుందని డాల్బీ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ సమీర్ సేత్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని 200కు పైగా స్క్రీన్లలో తమ డాల్బీ అట్మాస్ సాంకేతికత ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే 60కి పైగా థియేటర్లు డాల్బీతో నడుస్తున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా ఆరు భారతీయ భాషల్లోని 1200పైగా భారతీయ సినిమాలను, 850 డాల్బీ అట్మాస్ స్క్రీన్‌లపై స్ట్రీమింగ్ చేశారన్నారు. 2022లో కొత్తగా 100 స్క్రీన్లు జోడించబడ్డాయన్నారు. 50కి పైగా ఒఇఎంలతో జట్టుకట్టామన్నారు. డాల్బీ అట్మాస్ అనేది స్పష్టత, డిటెయిల్స్‌తో కూడిన మల్టీ డైమెన్షనల్ ధ్వని అని తెలిపారు. వీక్షకులు ఇంతకు ముందెన్నడూ వినని డిటెయిల్స్‌ను స్పష్టంగా వినేందుకు దోహదం చేస్తుందన్నారు.

అసమానతలు పెంచే బడ్జెట్

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ భారతదేశంలో అసమానతలను మరింత పెంచేదిగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రైతులు, పేదలను కొట్టి కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే విధంగా ఇది ఉందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ప్రజావ్యతిరేకమని, అత్యంత చెత్త బడ్జెట్ అని విమర్శించారు. ఇందులో రాష్ట్రానికి మొండిచేయి చూపిందని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గతేడాది రూ.93 వేల కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు రూ.60 వేల కోట్లకు తగ్గించారని వివరించారు. దేశంలో ధనవంతుల సంపద అంతకంతకూ పెరుగుతున్నదని, పేదలు మరింత పేదలవుతున్నారని పేర్కొన్నారు. ధనవంతులపై పది శాతం పన్ను విధిస్తే విద్యా, వైద్యం పేదలకు ఉచితంగా అందించొచ్చని సూచించారు. అలాంటి చర్యలు తీసుకోకుండా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసేలా కేంద్ర నిర్ణయాలున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి సంబంధించి ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్శిటీల ఊసేలేదని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన బకాయిలకు సంబంధించి ఈ బడ్జెట్‌లో పొందుపరచలేదని పేర్కొన్నారు. జిఎస్‌టితోపాటు మరోసారి సెస్‌ల పేరుతో దోపిడీ చేస్తోందని విమర్శించారు. జిఎస్‌టిలో రాష్ట్రాలకు వాటాల పెంపుదలకు సంబంధించిన ప్రస్తావన లేదని తెలిపారు.

పటాటోప బడ్జెట్ : ప్రజాపంథా

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుద్యోగులను, రైతులను, మధ్యతరగతి ప్రజలను నిరాశపర్చిందని సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. కార్పొరేట్ వర్గాలను సంతృప్తిపరిచేలా ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. అది మాయామశ్చీంద్ర, మెరుపుల, పటాటోప, మేడిపండు బడ్జెట్ అని ఎద్దేవా చేశారు. బిజెపి మార్క్ స్వదేశీ ముసుగు, కార్పొరేట్ బడ్జెట్ అని విమర్శించారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్య పరిష్కారం కోసం విశాల ఐక్య వేదిక

- హాజరైన పలు సంఘాలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం విశాల ఐక్య వేదిక ఏర్పాటులో భాగంగా బుధవారం ఆ సంస్థలోని పలు కార్మిక సంఘాలు భేటీ అయ్యాయి. తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎమ్‌యు) ఆఫీసులో జరిగిన ఈ సమావేశంలో ఆ సంఘం గౌరవాధ్యక్షులు అశ్వత్థామరెడ్డి, అధ్యక్షులు వి.తిరుపతి, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, ప్రచార కార్యదర్శి పి. రవీందర్‌రెడ్డి, ఎన్ఎమ్‌యు రాష్ట్ర అధ్యక్షులు పి. కమాల్‌రెడ్డి, టిజెఎమ్‌యు ముఖ్య సలహాదారు కృష్ణ, బికెయు అధ్యక్షులు ఆంజనేయగౌడ్, కార్మికసంఘ్ ప్రధాన కార్యదర్శి స్వామికుమార్ పాల్గొన్నారు. ఆర్‌టిసిలో కార్మికులపై పెరుగుతున్న పనిభారం, అద్దె బస్సులు పెంచి కన్సల్టెన్సీలు, ఔట్‌సోర్సింగ్ కంపెనీలను ప్రవేశపెడుతూ ఆర్‌టిసిని ట్రావెల్ ఏజన్సీ స్థాయికి దిగజర్చుతున్న వైనంపై చర్చించినట్టు నాయకులు తెలిపారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి విశాల ఐక్యవేదిక ఏర్పాటు ఆవశ్యకత ఉన్నదని సమావేశం అభిప్రాయ పడినట్టు చెప్పారు. ఈనెల 11న మరోసారి టిఎమ్‌యు కార్యాలయంలో మరోసారి భేటీ అవ్వాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి హాజరుకాలేని సంఘాలు 11వ తేదీ భేటీలో పాల్గొనాలనీ, ఆ మేరకు ఆహ్వానాలు పంపుతామని టిఎమ్‌యు అధ్యక్షులు వి. తిరుపతి చెప్పారు.

పిఆర్‌సిపై యాజమాన్యంతో టిఇఇజెఎసి చర్చలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ (పిఆర్‌సి)ను సాధ్యమైనంత త్వరగా చేయాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ జెఎసి యాజమాన్యాన్ని కోరింది. బుధవారంనాడిక్కడి విద్యుత్ సౌధలో జెఎసి చైర్మెన్ కోడూరి ప్రకాష్, కన్వీనర్ ఎన్ శివాజీ, కో-కన్వీనర్ కేవీ జాన్సన్, సభ్యులు రామేశ్వరయ్య శెట్టి తదితరులు టిఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకర్‌తో భేటీ అయ్యారు. పిఆర్‌సిపై చర్చించారు. ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్పు, ఆర్టిజన్స్ మాస్టర్ స్కేలు, పర్సనల్ పే తదితర అంశాలపై మాట్లాడారు. అలాగే క్రింది స్థాయి ఉద్యోగుల జీతభత్యాల వ్యత్యాసాన్ని కూడా సరిచేయాలని చెప్పారు. ఉద్యోగులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. పై అంశాలన్నింటినీ సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని ఈ సందర్భంగా ప్రభాకరరావు తెలిపారు.

సిఎం సాబ్ హామీని నిలబెట్టుకోండి

- లేకపోతే ఉద్యమం తీవ్రతరం
- విఆర్‌ఎల మౌనదీక్షలో జెఎసి నాయకులు
- సిఐటియు, కెవిపిఎస్, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలను సిఎం కెసిఆర్ అమలు చేయాలనీ, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని విఆర్‌ఎల జెఎసి నాయకులు హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద 'స్టేట్ విఆర్‌ఎ జెఎసి' ఆధ్వర్యంలో మౌనదీక్ష నిర్వహించారు. సిఎం కెసిఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలనీ, 55 ఏండ్లు పైబడిన వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన విఆర్‌ఎలకు పదోన్నతులివ్వాలనీ, 80 రోజుల సమ్మె కాలానికి వేతనాన్ని, ఆ సమయంలో మరణించిన వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలనే డిమాండ్లతో ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి తరలొచ్చిన విఆర్‌ఎలతో ధర్నాచౌక్ దద్దరిల్లింది. 80 రోజుల పాటు సమ్మె చేస్తే మునుగోడు ఎన్నికలకు ముందు ప్రభుత్వం దిగొచ్చి డిమాండ్లను నెరవేరుస్తామమంటూ హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ హామీ ఇచ్చి 100 రోజులు గడుస్తున్నా... అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై సిఎంకు, మంత్రి కెటిఆర్‌కు, మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు, ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలిచ్చినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది



ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేపట్టిన విఆర్‌ఎలు

బడ్జెట్ కేటాయింపుల్లో విఆర్‌ఎ డిమాండ్లను తీర్చేందుకు అనుగుణంగా కేటాయింపులు చేయకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మంత్రి కెటిఆర్ నాలుగు సార్లు, సిఎస్ రెండు సార్లు చర్చించారనీ, సిఎం అసెంబ్లీలో ప్రకటించినా ఆ మేరకు జీవోలు ఇవ్వకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. మౌనదీక్షలో జెఎసి చైర్మెన్ గడ్డం రాజయ్య, కో-చైర్మెన్ రమేష్ బహదూర్, సెక్రెటరీ జనరల్ షేక్ దాదేమియా, కో-కన్వీనర్లు వంగూరు రాములు, షేక్ రఫీ, మాదవ నాయుడు, వెంకటేష్ యాదవ్ తదితరులు మాట్లాడారు.

మతోన్మాదులకు అవకాశమివ్వొద్దు

డిమాండ్ల సాధన కోసం విఆర్‌ఎలు చేస్తున్న పోరాటానికి కెవిపిఎస్ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు మౌనదీక్షనుద్దేశించి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ చిన్న అసంతృప్తి ఉన్నా..దాన్ని ఉపయోగించుకునేందుకు మతోన్మాదులు కాచుకు కూర్చుంటున్నారని తెలిపారు. అలాంటి అవకాశాన్నివారికి ఇవ్వొద్దని సిఎంకు సూచించారు. ప్రభుత్వ మాటను గౌరవించి విఆర్‌ఎలు సమ్మె విరమించారనీ, అదే రీతిలో వారికి సర్కారు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. విఆర్‌ఎల పోరాటానికి చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమన్వయ కమిటీ తరపున మౌనదీక్షనుద్దేశించి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ విఆర్‌ఎల సమస్యల పరిష్కరించకుండా కాలయాపన చేయడం తగదని హితవు పలికారు. వారిని విస్మరిస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తదితరులు మౌనదీక్షలో పాల్గొని, విఆర్‌ఎల పోరాటానికి మద్దతు తెలిపారు.

రైతు వ్యతిరేక బడ్జెట్

- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా రైతు వ్యతిరేక బడ్జెట్ అని, కేంద్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలుతోందనది వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన స్పందించారు. వ్యవసాయరంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించడంపై మండిపడ్డారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వ్యవసాయరంగానికి 22శాతం కేటాయింపులు తగ్గించారని, గత బడ్జెట్‌లో రూ.2.25 లక్షల కోట్లు కేటాయిస్తే.. ఈ సారి రూ.1.75లక్షల కోట్లకు కుదించారన్నారు. కేంద్ర ప్రభుత్వం మెల్లగా ఎరువుల సబ్సిడీకి మంగళం పాడేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికే ఎరువుల ధరలు, డీజిల్, పెట్రోల్ ధరల పెంపుతో రైతులపై పెట్టుబడి భారం పెరిగిందన్నారు. కోటి మంది రైతులను మూడేళ్లలో సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్లిస్తామని, పది వేల బయో ఇన్‌పుట్ రిసోర్స్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, మైక్రో ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ మాన్యుఫాక్చరింగ్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తామని కేంద్రం గొప్పగా ప్రకటించిందని, కానీ ఇందుకోసం బడ్జెట్‌లో రూపాయి కేటాయించిన దాఖలాలు లేవన్నారు.రైతుల పట్ల, వ్యవసాయ రంగం పట్ల కేంద్రం అనుసరిస్తున్న విధానాలు ప్రోత్సాహకరంగా లేవని, ఈ బడ్జెట్‌తో రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు.

నిస్వార్థ జాతీయ ఉద్యమకారులు పప్పూరి రామాచార్యులు

ప్రజాశక్తి-కల్చరల్

జాతీయ ఉద్యమ కాలంలో ప్రజలను చైతన్య పరిచేందుకు శ్రీ సాధన పత్రికను నడిపి నిస్వార్ధ సేవ చేసిన పప్పూరి రామాచార్య వంటి వారు నేడు అరుదని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళావేదికపై కిన్నెర ఆర్ట్ థియేటర్ నిర్వహణలో రావి నూతల శ్రీరాములు రచించిన ప్రతిభాశాలి పప్పూరి రమాచార్యులు గ్రంథ అవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిధిగా డాక్టర్ రమణ పాల్గొని సంపుటిని అవిస్కరణ చేసి మాట్లాడారు. రామాచార్యులు దేశ స్వాతంత్ర ఉద్యమంలో తెలుగు నాట నాయకత్వం వహించిన వారిలో అగ్రశ్రేణి వారని వివరించారు ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలు శ్రీ రాములు ఆసక్తి కరంగా గ్రంథంలో చెప్పారని అభినందించారు. అధ్యక్షత వహించిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ ముక్కు సూటి తనం రాజీ పడని వ్యక్తిత్వం, సున్నిత హాస్యం రామాచార్య రచనలో ద్యోతకమవుతాయని నీలం సంజీవ రెడ్డి వంటి వారికి ఆంగ్ల విద్యనేర్పిన ఆయనతో రాజకీయ విభేదాలు ఉండేవని తెలిపారు. న్యాయవాది రెడ్డి, డివి రాఘవ పాల్గొన్న సభకు రఘురాం స్వాగతం పలికారు

హరి కథా ప్రక్రియను విస్మరించరాదు

దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

ప్రజాశక్తి-కల్చరల్

తెలుగు సంస్కృతిని హరి కథలు, బుర్ర కథలు సుసంపన్నం చేశాయని వాటిని విస్మరించరాదని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. హరి కథకులకు దేవాలయాలలో పర్వదినాలలో వారి ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. రవీంద్రభారతిలోని ఘంటసాల కళా ప్రాంగణంలో డాక్టర్ కెవి రమణ జన్మదిన సందర్భంగా ఏడు రోజుల పాటు జరిగే హరికథ సప్తాహంకి కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆరంభమయ్యాయి. ముఖ్య అతిధిగా ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామ ప్రాంతాల్లో పౌరాణిక నాటకాలు హరి కథలకు ఆదరణ ఉండేదని నేడు సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఈ కళలపట్ల యువతలో ఆసక్తిలేదని ప్రాచీన కళలను ముందు తరాలకు అందించే బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రజలపైనా ఉందని అన్నారు. సాహితీ వేత్త డాక్టర్ వోలెటి పార్వతీశం అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఒక వ్యక్తి తన జన్మదినాన్ని వారంపాటు హరికథ మహోత్సవంగా జరిపి హరికథ కళాకారులను ప్రోత్సాహిచడం విశేషమని ఇందుకు కారణమైన రమణాచార్య ప్రశంసనీయులు అన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ పాల్గొన్న సభలో ఇటీవల కేంద్ర సంగీత నాటక అకాడెమీ అవార్డు పొందిన ఉమామహేశ్వరిని మంత్రి సత్కారం చేశారు .రఘురాం స్వాగతం పలికారు. ఆనంతరం చిరంజీవాచార్యులు భాగవతార్ చే సీతారామ కల్యాణం హరికథ గానం ఆసక్తి గా సాగింది.



అవార్డు పొందిన ఉమామహేశ్వరిని సత్కరిస్తున్న మంత్రి

రిజర్వు చేసుకుంటే రాయితీలు ఆర్‌టిసి ప్రకటన

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ముందుస్తు రిజర్వేషన్ చేసుకుంటే ప్రయాణికులకు ప్రత్యేక రాయితీలు ఇస్తామని టిఎస్‌ఆర్‌టిసి ప్రకటించింది. 31 రోజుల నుంచి 45 రోజుల ముందు రిజర్వేషన్ చేసుకుంటే టికెట్‌లో ఐదు శాతం, 46 రోజుల నుంచి 60 రోజుల ముందు టికెట్ బుక్ చేసుకుంటే పది శాతం టికెట్ చార్జీలో రాయితీ ఇస్తామని ఆ సంస్థ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం (ఓపీఆర్ఎస్) సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశామన్నారు. ముందస్తు రిజర్వేషన్ సదుపాయం ఉన్న అన్ని సర్వీస్‌లకు ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టంచేశారు. ఈ పద్ధతిని ప్రయోగాత్మకంగా సంక్రాంతి పండుగకు వర్తింప చేశారు. ప్రయాణికుల నుంచి మంచి స్పందన రావడంతో ఈ సదుపాయాన్ని ఈ ఏడాది జూన్ వరకు పొడిగిస్తున్నట్టు ప్రకటించారు. ముందస్తు రిజర్వేషన్ కోసం అధికారిక వెబ్‌సైట్ www.tsrtconline.inను సందర్శించాలని కోరారు.